క్లుప్తంగా

ఎంపీ టికెట్ వంశీకృష్ణకే ఇవ్వాలి

జూలపల్లి: పెద్దపల్లి ఎంపీ టికెట్‌ను యువనేత గడ్డం వంశీకృష్ణకే ఇవ్వాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పాటకుల మహేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జూలపల్లిలో మాట్లాడారు. మాజీ ఎంపీ దివంగత గడ్డం వెంకటస్వామి పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. వంశీకృష్ణకు టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. నాయకులు మాదాసి విజయ్, ఆనంద్‌కుమార్ తదితరులున్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం'

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిలాష్ తెలిపారు. మంగళవారం ఆయన పెద్దపల్లిలో మాట్లాడారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామన్నారు. నాయకులు భరత్, ప్రణయ్, ప్రశాంత్, రాజు, ప్రశాంత్‌రాజ్, సందీప్, శైలెందర్, నవీన్ తదితరులున్నారు.

మూడోసారి ప్రధానిగా మోదీని గెలిపించాలి

గోదావరిఖని: దేశంలో మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం గోదావరిఖని 11వ డివిజన్‌లోని సంజయ్‌నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ పెద్దపల్లి అభ్యర్థికి ఓటువేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. నాయకులు అడ్డూరి రాజేశ్, రేణుక, మామిడి రాజేశ్, సంపత్, శ్రీనివాస్ తదితరులున్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

జూలపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అబ్బాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లను ధర్మారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యుత్, తాగునీరు సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి రవికి సూచించారు.

చిరుధాన్యాలపై అవగాహన

ఎలిగేడు: మండలంలోని ర్యాకల్‌దేవుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా నిర్వహించారు. తల్లులకు, గర్భిణులకు చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, అంగన్‌వాడీ టీచర్ ఓదేశ్వరి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం, ఆశవర్కర్ పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు



లంద వద్ద గ్రామస్తులు

జూలపల్లి: మండల కేంద్రంలో గుంటి వారి ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. డప్పుచప్పుళ్ల మధ్య ఎల్లమ్మ తల్లికి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన లంద వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 38వ వార్షికోత్సవంలో భాగంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభయ్యాయి. వేంకటేశ్వరసామికి అభిషేకం జరిపి, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

రామగిరి: సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి పరిసర గ్రామాల యువతకు డ్రోన్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తోపాటు మొత్తం 38 కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలకు చెందిన యువత సమీపంలోని ఎంవీటీసీ నందు దరఖాస్తు నేరుగా సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో చేసుకోవాలనుకునేవారు ఎస్‌సీసీఎల్‌మైన్స్.కామ్/అప్రెంటిస్‌షిప్ వెబ్‌సైట్ చూడాలన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు


జ్యోతినగర్: స్థానిక పలు లాడ్జీల్లో పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీలు చేశారు. రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ రికార్డులను పరిశీలించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని యజమానులకు సూచించారు.

ఒకరికి జైలు

గోదావరిఖని: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి 3 రోజుల జైలుశిక్ష పడినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మద్యం సేవించి, వాహనం నడుపుతూ పట్టుబడిన కంకణాల సంపత్‌రెడ్డిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ తీర్పు చెప్పారన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ ఎప్పుడో?

- పెద్దపల్లిలో న్యాక్ సెంటర్ ఏర్పాటులో జాప్యం
- పేరు నమోదు చేసుకున్నవారికి తప్పని ఎదురుచూపు



పెద్దపల్లి పట్టణం

పెద్దపల్లిరూరల్: నిరుద్యోగ యువతకు, నిరక్షరాస్యులైన కూలీలకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించే న్యాక్(జాతీయ నిర్మాణ సంస్థ) శిక్షణ కేంద్రాన్ని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఏర్పాటు చేసి, టైలరింగ్, పెయింటింగ్, తాపీ పనిలో శిక్షణ నివ్వాలని నిర్ణయించినా.. ఇంకా కేంద్రమే ప్రారంభం కాకపోవడంతో ఈ ప్రాంత కార్మికుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

అనువైన భవనం లేకనే..

న్యాక్ సెంటర్ ఏర్పాటుకు సంస్థ అధికారులు ముందుకొచ్చినా.. శిక్షణ ఇచ్చేందుకు అనువైన భవనం లేకపోవడం వల్లే ఆలస్యమవుతోందని తెలిసింది. పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ, మార్కెటింగ్ శాఖ ఆవరణలోని గదులు, గిడ్డంగుల్లో తాత్కాలికంగానైనా ప్రారంభించాలని నిర్ణయించినా ఆయా శాఖల అధికారులు సమ్మతించలేదు.

ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్ దృష్టికి..

పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో వృథాగా ఉన్న ఓ షెడ్డును కేటాయిస్తే దానికి మరమ్మతులు చేస్తూనే తాపీ, పెయింటింగ్ పనులపై శిక్షణనిచ్చి, గదిని వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే విజయ రమణారావు, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ దృష్టికి న్యాక్ అధికారులు తీసుకెళ్లినట్లు సమాచారం. వారు సానుకూలంగా స్పందించినా ఐటీఐ యాజమాన్యం ఇంకా ఏ నిర్ణయాన్ని ప్రకటించలేదని తెలిసింది. ఇక, వ్యవసాయ మార్కెట్‌యార్డులో తాత్కాలికంగా ఏర్పాటుకు అవకాశమివ్వాలన్న అభ్యర్థనకు మార్కెటింగ్ అధికారులు సైతం సమ్మతించడం లేదని సమాచారం.

పేరు నమోదు చేసుకున్న నిరుద్యోగులు

తాపీ, పెయింటింగ్, టైలరింగ్ పనుల్లో శిక్షణ పొందేందుకు 30 మంది చొప్పున నిరుద్యోగులు, కార్మికులు తమ పేరు నమోదు చేసుకున్నారు. ఇంకా శిక్షణ ప్రారంభించకపోవడంతో వారికి ఎదురుచూపు తప్పడం లేదు. న్యాక్ సెంటర్ ఏర్పాటైతే 15 రోజులు శిక్షణనివ్వడంతోపాటు శిక్షణ కాలానికి రూ.300, భోజనం, స్టేషనరీ అందిస్తారు. పూర్తయ్యాక ధ్రువపత్రం ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారు స్వయంశక్తితో ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి, న్యాక్ కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వెంటనే ప్రారంభించాలి



న్యాక్ సెంటర్‌ను వెంటనే ప్రారంభించి, ఈ ప్రాంత నిరుద్యోగులు, కార్మికులకు శిక్షణ ఇప్పించాలి. ఇందుకోసం ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను కేటాయించేలా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. – కల్వల రాజేశం, పెద్దకల్వల

ఆలస్యం చేయడం సరికాదు



న్యాక్ సెంటర్‌ను ప్రారంభించడంలో ఆలస్యం చేయడం సరికాదు. వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి, పేర్లు నమోదు చేసుకొని, నిరీక్షిస్తున్న వారికి శిక్షణనివ్వాలి. న్యాక్ కేంద్రాన్ని వీలైనంత త్వరగా అద్దె భవనంలోనైనా ప్రారంభించాలి.

– ముత్యంరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

రెండోరోజు 'పది' పరీక్ష ప్రశాంతం



జయ్యారం కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



పరీక్ష కేంద్రానికి నడుస్తూ వెళ్తున్న విద్యార్థులు

పాలకుర్తి: రెండోరోజు పదోతరగతి పరీక్ష మంగళవారం పాలకుర్తి మండలంలో ప్రశాంతంగా జరిగింది. జయ్యారం హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ తనిఖీ చేశారు. విద్యార్థుల వివరాలు, కేంద్రంలో సౌకర్యాలపై ఆరాతీశారు. బసంత్‌నగర్ ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల సెంటర్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, బసంత్‌నగర్ ఎస్సై స్వామి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో షబ్బీర్‌పాషా వేర్వేరుగా సందర్శించారు. వారి వెంట ఎంఈవో సంపత్‌రావు ఉన్నారు. అంతకుముందు ఆయన కొత్తపల్లి, పుట్నూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని మధ్యాహ్న భోజన కార్మికులను ఆదేశించారు.

'విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగలేదు'

బసంత్‌నగర్ ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల పరీక్ష కేంద్రంలో సోమవారం పదోతరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు సమయం విషయంలో ఎలాంటి నష్టం జరగలేదని డీఈవో మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ప్రారంభం రోజు కావడంతో పిల్లలందరూ సీటింగ్ అరేంజ్‌మెంట్ ప్రకారం కూర్చున్న తర్వాత ప్రశ్నాపత్రం కౌంటింగ్‌లో 10 నిమిషాలు ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. అయితే, చివరలో ఇన్విజిలేటర్లు 12.30 గంటలకు బదులు 12.40 గంటలకు విద్యార్థుల నుంచి సమాధాన ప్రతాలు తీసుకున్నారని పేర్కొన్నారు.

కేశోరాం సెక్యూరిటీ సిబ్బంది అత్యుత్సాహం

బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం సెక్యూరిటీ సిబ్బంది తీరుతో పదోతరగతి పరీక్ష రాసే విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. కేశోరాం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల పరీక్ష కేంద్రానికి ఈ స్కూల్‌తోపాటు బసంత్‌నగర్‌లోని ఆలీవర్, జీడీనగర్‌లోని యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం, కన్నాల, ఈసాలతక్కళ్లపల్లి, బసంత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదోతరగతి విద్యార్థులు మంగళవారం తమ స్కూల్ బస్సుల్లో వెళ్తున్నారు. స్టాఫ్‌కాలనీ గేట్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకొని, లోపలికి అనుమతించలేదు. దీంతో విద్యార్థులు దాదాపు 800 మీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సై స్వామి కంపెనీ అధికారులతో మాట్లాడి, వాహనాలను పరీక్ష కేంద్రం వరకు అనుమతించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కో–ఆప్షన్ సభ్యుడు చెర్కు బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి మోహిద్‌సన్నీ తదితరులకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కండువాలు కప్పి, ఆహ్వానించారు. చేరినవారిలో నాయకులు బెల్లంకొండ రవీందర్‌రావు, గుంపుల ఓదెలు, హమీద్, కొలిపాక వీరస్వామి, వెంకటేశ్వర్లు, నర్సింగరావు, అంజయ్య, ఎల్లయ్య తదితరులున్నారు.

లారీ యజమానుల సమస్యలు పరిష్కరిస్తా

లారీ యజమానుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం గోదావరిఖనిలోని లారీ యజమానుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోడింగ్ పెంచేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రతీ లారీ యజమాని ధైర్యంగా ఉండాలన్నారు. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కుందూరి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

రామగుండం: పట్టణ ప్రజలు మంగళవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను సన్మానించారు. రామగుండంలో బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం కాలం చెల్లిన జాబితాలో చేరగా సాంకేతిక లోపాలతో తరచూ విద్యుదుత్పత్తికి అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో నూతన విద్యుత్ కేంద్రం స్థాపన దిశగా అడుగులు పడుతున్నాయన్న చర్చ జరుగుతోంది. ఈ విషయంలో ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారని మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు తెలిపారు. రామగుండానికి పూర్వవైభవం రానుందని పేర్కొన్నారు. నాయకులు గౌస్‌బాబా, మహమ్మద్ ఉస్మాన్ షరీఫ్, ఇష్తకార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వార్

- ఆందోళనకు పిలుపునిచ్చిన ఇరు పార్టీల నాయకులు
- ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ధర్మారం: మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల పరస్పర దాడి నేపథ్యంలో ఇరు పార్టీలూ మంగళవారం ఆందోళనకు పిలుపునిచ్చాయి. దీంతో పోలీసులు ముందస్తుగా బందోబస్తు నిర్వహించారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి మాధవరావు, కాంగ్రెస్ నాయకుడు సోగాల తిరుపతి ఒకరిపై ఒకరు దాడి చేసుకొని, ఠాణాలో ఫిర్యాదు చేశారు. అయితే, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ రాస్తారోకోకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. ఇరు పార్టీల నాయకులు ధర్మారం చౌరస్తాకు చేరుకున్నారు. ఎస్సై సత్యనారాయణ ఎన్నికల కోడ్ ఉల్లంఘించరాదని చెప్పడంతో కాంగ్రెస్ నాయకులు వెళ్లిపోయారు. బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, నాయకులు పాకాల రాజయ్య, దేవి రజనీకాంత్, అపర్ణ, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్ ప్రోత్సాహంతో రౌడీయిజం..

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రోత్సాహంతో బీఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియా ముసుగులో రౌడీయిజం చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాధవరావుతో సోషల్ మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు. అతని ఫోన్‌లో వాట్సాప్ చాటింగ్‌ను పరిశీలించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించి, ధర్నా చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సైకి వినతిపత్రం అందించారు. మాజీ ఎంపీపీ కోడారి హన్మయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, పీఎస్‌ఎస్ మాజీ చైర్మన్ దేవి జనార్దన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు కాడె సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు..

కులం పేరుతో దూషిస్తూ చంపుతానని బెదించాడని సోగాల తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాధవరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదే ఘటనలో సోగాల తిరుపతి, సోగాల వంశీతోపాటు మరో ముగ్గురు తనను కొట్టి, దుర్భాషలాడారని మాధవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లోని ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలకు ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని సీపీఎం నాయకులు ఎం.రామాచారి, వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరమ్మ కాలనీలోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. మల్లు స్వరాజ్యం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పట్టాలివ్వాలని కోరారు. నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

రామగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తి చాటాలని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. సెంటినరీకాలనీ జెఎన్టీయూ కళాశాలలో బీ జోన్ స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. తాను సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో క్రీడా మైదానాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని, క్రీడలకు సమయం కేటాయించానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి, ఆయా విభాగాల అధిపతులు ఆర్.దుర్గారావు, సతీశ్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, సునీల్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచేలా చూస్తామని గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో వివిధ జోన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 3 నెలలు గడిచినా ఈ విషయంలో ఏమీ మాట్లాడకపోవడం సరికాదని పేర్కొన్నారు. నాయకులు రవి, దేశాయినాయక్, రాము, శేఖర్, లత, పద్మ, నీలమ్మ, శ్రీను తదితరులున్నారు.

మానేరులో మట్టి రోడ్డు తొలగింపు



ముత్తారం: మండలంలోని ఓడెడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి మానేరులో పలువురు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తికాని ఓడెడ్–గర్మిళ్లపల్లి మానేరు వంతెన పక్క నుంచి మట్టి రోడ్డు నిర్మించారు. టోల్ ట్యాక్స్ పేరిట వాహనదారుల నుంచి రోజుకు రూ.2 లక్షల వరకు వసూలు చేయడంపై రెండు జిల్లాల అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. కానీ, వారు తమ పరిధి కాదని, తమ శాఖ పరిధిలోకి రాదని తప్పించుకున్నారు. ఈ మట్టి రోడ్డు గుండా రోజుకు వందలాది లారీల ఇసుక దందా సాగుతోంది. లారీకి రూ.1,000 వసూలు చేయడం తదితర సమస్యలపై స్థానికులు ఇటీవల పెద్దపల్లి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముత్తారం ఆర్‌ఐ భవాని, ఎంపీవో వేణుమాధవ్, ఎస్సై వేణుమాధవ్, ఇరిగేషన్ జేఈఈ రఫీ, పంచాయతీ కార్యదర్శి స్వప్న మంగళవారం మట్టి రోడ్డును పరిశీలించారు. చెక్‌పోస్టు పేరిట వసూళ్లపై స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రొక్లెయిన్ సహాయంతో ఆ రోడ్డును తొలగించారు. అయితే, అక్రమ వసూళ్లపై స్పందించారా లేదా ఎన్నిక వేళ అనుమతి లేని రోడ్డుతో ప్రమాదం ఉంటుందని భావించి తొలిగించారా అన్న విషయమై జోరుగా చర్చ జరుగుతోంది.

సీసీ కెమెరాల ఏర్పాటు

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని కేఫ్‌టీ పెట్రోల్ పంపు ప్రాంగణంలో మంగళవారం 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినట్లు ఎస్సై స్వామి తెలిపారు. నేరాల నియంత్రణకు ఫోర్‌లేన్ రహదారిపై ముఖ్య కూడళ్లను గుర్తించి, కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

సింగరేణి బదిలీ అధికారులకు సన్మానం



గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్–1లో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న అధికారులను జీఎం శ్రీనివాస్ మంగళవారం సన్మానించారు. సివిల్ ఏజీఎం నాగేశ్వర్‌రావు, సేఫ్టీ అధికారి బండి సత్యనారాయణ, వర్క్‌షాప్ డీజీఎం మదన్‌మోహన్‌లకు జ్ఞాపికలు అందజేశారు. ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజెంట్ బానోతు సైదులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ ఎస్సైకి..

సుల్తానాబాద్: స్థానిక ఎస్సైగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన శ్రవణ్‌కుమార్‌ను బీజేపీ జిల్లా మాజీ కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, నాయకులు మహేందర్ యాదవ్, తిరుపతి యాదవ్, తిరుపతి, రాజన్న సన్మానించారు. శాంతిభద్రతలకు సహకరించాలని ఎస్సై కోరారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

రామగిరి: పార్లమెంట్ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో శైలజారాణి అన్నారు. మంగళవారం రామగిరి మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయించారు. ధామె బుధవారంపేటలో పర్యటించి, గోడలపై ఉన్న పోస్టర్లను తొలిగించాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీవో సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులున్నారు.

ఓటు సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్: లింగాల గ్రామస్తులకు సాంస్కృతిక సారధి కళాకారులు మంగళవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటు సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. వెంకన్నగౌడ్, రాజనర్సు, పద్మ, శంకర్ గౌ డ్, రాజన్న, రమ, శ్రవణ్, రేణుక, శ్రీవల్లి ఉన్నారు.

మెడికల్ కళాశాల నియామకాలపై విచారణ చేపట్టాలి

జ్యోతినగర్: గోదారిఖని మెడికల్ కళాశాలలో దొడ్డిదారిన నియామకాలు చేపట్టారని రామగుండం ఐదో డివిజన్ కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి ఒక ప్రకటనలో ఆరోపించారు. వారధి పేరిట 74 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అభ్యర్థుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, రిక్రూట్‌మెంట్ నిలిపివేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆయా పోస్టులను ఏ ప్రాతిపదికన నియమించారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక నిరుద్యోగులతో చెలగాటమాడటం మానుకొని, అర్హత ఉన్నవారిని నియమించాలని సూచించారు. కళాశాల ఐదో డివిజన్‌లోనే ఉన్నప్పటికీ ఎలాంటి ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. ఉద్యోగ నియామకాలపై విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడినవారిని సస్పెండ్ చేయాలని కోరారు.

'ట్రినిటీ'లో అలరించిన యువ ఉత్సవ్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు మంగళవారం యువ ఉత్సవ్ పేరిట వీడ్కోలు సమావేశం నిర్వహించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ హరికాంత్ హాజరై, మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ నీతూరెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు

జూలపల్లి: మండల కేంద్రంలోని రావుల మల్లన్న అలయ కమ్యూనిటీ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శాతకర్ణి లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి, శివం లయన్స్ క్లబ్ ఆఫ్ జూలపల్లి వారి ఆధ్వర్యంలో 30 మందికి వైద్య పరీక్షలు చేశారు. 8 మందికి ఆపరేషన్ చేయాలని గుర్తించి, రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేయగా ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి ప్రారంభించారు. ఎస్సై శ్రీధర్, లయన్స్ కొంజెర్ల వెంకటయ్య, మేరుగు రమేశ్, పాటకుల అనిల్, కోడూరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీర్లపల్లి ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో..

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14 డివిజన్ వీర్లపల్లి ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో మంగళవారం సఫలీకృత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీన్ని నగరపాలిక కమిషనర్ శ్రీకాంత్, డీడబ్ల్యూవో రవూఫ్‌ఖాన్ ప్రారంభించారు. వైద్యులు రాజేందర్, రాజశేఖర్, దుర్గాప్రసాద్, నాగిరెడ్డి, మల్లికార్జున్, ఆనంద్ బాబు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నాయకులు పీటీ.స్వామి, సీతారామరెడ్డి, తానిపర్తి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

సుల్తానాబాద్: పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో తెలంగాణ డెంటల్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల డైరెక్టర్ సంజీవ్‌కుమార్ తెలిపారు. సంబంధిత పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు మణిదీప్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్'లో గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం



రామగుండం: పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రాథమిక విద్యకు ప్రమోట్ అవుతున్న యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డ్రెస్, క్యాప్ అందించి, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ యాదగిరిగౌడ్, హెచ్‌ఎం నోయల్ జోసెఫ్, ప్రిన్సిపాల్ తిరుపతిగౌడ్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులున్నారు.